# ఓట్ల సంబరం

కుల, మత ప్రమేయం లేని రాజ్యాంగాన్ని రక్షిస్తామని ప్రమాణం తీసుకుని అధికారం చలాయించిన పార్టీయే, శాసనసభ ఎన్నికల్లో దివ్యపురం నియోజక వర్గంలో ఏ కులం వోటర్లు అధికంగా ఉన్నారో ఆ కులం వాడినే అభ్యర్థిగా నిలబెట్టారు. అభ్యుదయ కాముకులం అని చాటుకున్న ప్రతిపక్షం వారు కూడా వారి అభ్యర్థినీ ఆ కులం నించే ఎంచారు.

అధికార పక్షం అభ్యర్థి పాతవాడే. అతని పేరు రాజయ్య. అయినా ఆ నియోజకవర్గంలో అతనిని 'బస్సుల బాబు' అంటారు. ఇతనికి పదిహేను రూటు బస్సులున్నాయి. ప్రతిపక్షం అభ్యర్థి శ్రీరాములు. కానీ ఆ నియోజకవర్గంలో అతనిని 'పీపాల బాబు' అంటారు. అతను సారాకొట్లు హోల్ సేల్ గా పాడేశాడు.

బస్సుల బాబుకు, పీపాల బాబుకు కులంలోనూ, సంఘంలోనూ పరపతి ఉంది. ఒకరి రంగంలోనికి ఇంకొకరు దూకకుండా ఇన్నాళ్ళూ చుట్టరికాలు ఆపితే, ఇప్పుడీ రాజకీయరంగంలో పోటీల పౌరుషాలతో తొడలు చరిచి, మీసాలు నులిపి పోటీపడక తప్పలేదు. కారణాలు అందుకు తెలిసినవే. ఎన్ని జీపులొచ్చాయి, ఎన్ని మైకుసెట్లు పాల్గొన్నాయి, ఎందరెందరు డొనేషన్లు ఇచ్చారు, ఎన్ని మీటింగులు జరిగాయి,ఎందరు అగ్రనాయకులు ఇరువైపులా గర్జించినా అసలు మహా నాయకుల

"ఒరేయ్. కూరాకిస్తే పుచ్చుకోరా, వద్దనకు. తరవాత ఈ నాయకుల ముకమే కనపడదు. ఓటు గుద్దినప్పుడు న్యాయం తప్పితే గుండెదడ పట్టుకోదా?"

ఇంకో సమస్య - ఓటు వేసేవరకూ ఓటర్లను తమ చెప్పుచేతల్లో ఎలా ఉంచుకోవటం? కప్పల్లా ఒడ్డుకు గెంతేస్తే? అందుకే చెక్క భజనలు ఒక పార్టీ పెడ్తే, ఇంకో పార్టీ బుర్రకథ పార్టీని తెచ్చింది. ఆ 'స్వింగ్' తిప్పడానికి మొదటి పార్టీ కోయ డాన్సులు మొదలెడితే, దానిని తట్టుకోడానికి రెండో పార్టీ రికార్డు డాన్సు గ్రూపును తెచ్చింది. ఎన్నికల తేదీ దగ్గరౌతున్న కొద్దీ నిజంగా వేట పురంలో రోజూ గ్రామదేవత సంబరాలు జరుగుతున్నట్లుండేది.

ఈ ఉపచారాలు జరుగుతుండగానే ఒక పార్టీ అభ్యర్థి గ్రామంలో కాలు పెట్టాడు. తోవలోనే కారు ఆపేసి పూల దండల వర్షం కురిపించి గద్దె ఎక్కించారు. ఉపన్యాసం దంచేసి సవినయంగా "మీరంతా గౌరవించి, అభిమానించి తమ అమూల్యమైన ఓటు నాకువేస్తే మీకు సేవచేసే భాగ్యం నాకు కలుగుతుంది." అన్నాడు.

ఒకడు సభలో లేచి ....

"ఎమ్మెల్యే అయినాక ఈ నిట్ట (స్తంభం) వొదిలి ఇంకో నిట్టని పట్టుకోవా?" అనరిచాడు.

"ఏటిరా ఆ పెద్దమనిషితో ఆ తాగుడు కబుర్లు?"

"తాగినోడు యదార్థం ఆడడా? తాగనోడు మాయ సెయ్యడా? నాను మేలో భళీ అని జైకొట్టే పెద్దమనిషిని కానుబోబో!"

ఆ అడిగిన య్యెర్రయ్యని కుదలేస్తే ప్రక్కనే కూర్చున్నవాడు మెల్లగా "ఏలరా అలా కూసి సెడ్డయిపోతావు. ఇక్కడ ఇనటం, అక్కడ మన పని మనం సేసేడమే" అన్నాడు.

ఆ రాత్రి పాత ప్రెసిడెంటు విందు భోజనానికి య్యెర్రయ్యని కూడా పిలిపించి మంచి గొర్రెపోతు మాంసం కూర అభ్యర్థి పంక్తిలో పులావుతో పదుగురి పెద్దలతో తినిపించాడు.

కొత్త ప్రెసిడెంటు తక్కువ తినలేదు. ముందు కోడిమాంసాలతో భోజనం కాదు సంతర్పణ చేశాకే మీటింగు పెట్టించాడు.

"అవతలి పార్టీవోడు నన్ను తాగుబోతన్నాడు. ఎదార్థం ఆడితే నివ్వూ అంటావేమో?" అన్నాడు య్యెర్రయ్య ఈ మీటింగులో లేచి.

"అడుగు....అడుగు."

"పెపంచం ఒక రీతిని నడువనేదు. ఏవిలాగ జరగతుంది? మనిసినాగే దేవుడూ మంచీ సెడూ మరిసిపోయి, నలుగురెటుంటే అటేపే మొగ్గుతున్నాడు. మాకు సైతన్యంలో ముంచినోడు వచ్చేదాకా యాదో ఒక బురఖా నాయకుడికి

ఓటెయ్యకపోతే ఆ హక్కు పోతాదికదా? గొర్రెపోతులు. కోళ్ళ గుంపుల పీకలు కోసినట్టు మా పీకలు కొయ్యకండి నాయనలారా! నాయకులారా!"

ప్రచారం గడువైపోయింది. నాయకుల పాదయాత్ర మొదలైంది. అడుక్కున్నవాడి దగ్గర నించీ అల్లాటప్పయ్యవరకూ అధికారంలో ఉన్న అభ్యర్థి నమస్కరించి "నన్ను గెలిపించడ"ని ప్రాధేయపడ్డాడు: ఐనా ఏ వీధి ప్రెజ ఆ వీధిలోనే అడగవలసింది అడిగేశారు.

"మాం సాదాసీదా మనుసులం. మా కట్టాలు సెప్పుకుంటే సూతుంలే అంటావా? పెద్దోలవి సన్న సన్నగా సేసేస్తావా?"

"పచ్చకామెర్లతో పదిమంది సస్తేగానీ మా హరిజనవాడలో బోరింగు తవ్వించలేదు. ఈ కుళ్ళునీరు పోడానికి కాలువ తవ్వించినారా? దోమలు మూగి మా రక్తాలు తాగేసి మమ్మల్ని మలేరియా జొరంతో వొణికించేస్తున్నాయ్."

"ఈ ఊరికి ఒక రచ్చబండ వచ్చినాదా? వీధి దీపాలొచ్చినాయా? సెయ్యిస్తానని మరి కనిపించినావు కాదు. ఇప్పుడు సగం సచ్చిన పాములా ఏలొచ్చినావు బాబో?"

"పేరొకడిది పొందిందొకడు. పద్ధతి తప్పిపోయి ఇష్టమైనోలకి ఇల్లు యిచ్చినారు. ఏమంటే నివ్వే అన్నావు కదా సంప్రదింపులు సేసుకుందామని. ఏదీ? సంప్రదింపులు లేవు సంతకెళ్ళడం నేదు."

"రోడ్డేసి రెండు పంటలైనాది. నడగలమా? రెండు మదములు కట్టడానికి రెండేళ్ళా? నీ మాట మీద నమ్మకం పోనాది, అనాదోడు ఇప్పుడు కళ్ళు తెరిసినాడు.''

కోపం అణచుకోడానికే ఈ అభ్యర్థి సత్తువంతా వినియోగించవలసి రావటంచేత ఈ పనులన్నీ నావికావు పంచాయతీ వాళ్ళవని అనలేకపోయాడు. ఇక ప్రత్యర్థికి కొంత సులువైపోయింది. ఓటర్లు ఏమి అడుగుతారో ముందుగా తెలియటం వల్ల సమాధానాలతోనే పాదయాత్ర మొదలు పెట్టాడు. చాటుగా ఇతను హరిజనవాడ కాలువ, రెండు మదుములు ఎలక్షను ముందుగానే మొదలు పెట్టేశాడు.

పాదయాత్రలు ముగిశాక ఓటింగు ముందు రోజు రాత్రి సారా సీసాలు ఊర్లో రెండు వీధుల్లో రెండు పార్టీల వారు దించారు. ఒక చోట 'కిక్' ఇవ్వక పోతే ఇంకొకచోటికి వెళ్ళి తాగినా ఎర్రయ్యకి కిక్కు ఇవ్వలేదు. కాసేపయ్యాక ఆ అర్ధరాత్రప్పుడు వీధంట అరుస్తున్నాడు.

'అతగాడు అరవై సీట్ల బస్సులో నూట ఇరవై మందిని వోవర్‌లోడ్ చేసి సంపాదించినాడు. ఇతగాడు సారా పీపాల్లో ఒకటికి మూడొంతులు నీరు కలిపి ఆర్జించినాడు. ఈ ఇద్దరే డబ్బుతో పులిసిపోయిన ధర్మాతులు. హైబ్రిడు

యి త్తనాలు. నోరులేని గొర్రెపోతులూ, కోళ్ళు పీకలు తెగేసి ఈళ్ళు సత్రాలు పెట్టనేదా? ఛూ! ఈ సీళ్ళసారాతో మా పీకలూ తెగేస్తన్నారు. ఈ ఇద్దరితో అధికారంలో ఎవడొచ్చినా, ఏం సేసినా ఎవడి డబ్బుతో సేస్తాడు? మన డబ్బు మనకే ఇస్తాడు కదరా!"

చివరకు ఎలక్షను రోజు వచ్చింది. ఊర్లో ఓటువేసిన ప్రతివాడికి ఒక రూపాయి టిఫిను ఇచ్చారు. రిజల్టు తెలిసాక వచ్చిన వ్యాఖ్యానా లివి.

"ఏటిమావా! ఈ యేగు (వేప్)! మా పేగులు తెగిపోనాయి!"

"ఐతే ఆడదానికి బియ్యంలో రాళ్ళగవడనేనేదు. ఆడి ముకం అగపడ్డాది. మాయదండంతో ఆడాళ్ళని మాయలో ముంచేసిన ఆడి మార్కుకే వోటు గుద్దేసి నారు."

"ఎవరు గెలిచినా ఒకటే ఆలికి! ఆల కులం పరపతికోసం కదా ఈ ఎల క్సను?"

తాము ఓటువేసిన వాడు గెలిచాడని సంతోషంతో కొందరు తాగితే, ఓడి పోయాడని విచారంతో మరికొందరు తాగారు.

ఒక లక్ష మదుపు పెట్టిన తన అభ్యర్థి గెలిస్తే తిరుపతివెళ్ళి గుండు చేయించుకుంటానన్న ఒక కలవారి కోడలకు గుండు చెయ్యించుకునే అవసరం లేకపోయింది.

రెండు లక్షలు మదుపుపెట్టి తన అభ్యర్థిని గెలిపించిన ఇంకో ఇల్లాలు మరో లక్ష నూర్రూపాయల నోట్లు తిరుపతి హుండీలో వేసింది.

ఎటొచ్చి ఎర్రయ్య ఊరి పెద్దలకు వినిపించేటట్లు అరిచాడు:

"పెజ కళ్ళుకప్పి దాన్నం రాసులు పోసుకున్నరు కదా! ఎన్ని పిచ్చుకలు, ఎన్ని కాకులు ఎగిరి ఎన్ని గింజలు ఏరుకుంటే తరుగుతాయి? ముందుకున్నది ముసళ్ళ పండగ, వచ్చే ఎలక్షన్లకి పెజ ఎమ్మెల్లేని పట్టి, అడిగి గుంజి వదిలే స్తారు. ఖబడ్దార్!" అన్నాడు.

ఆ రాత్రి దిగువ పొలంలో గొల్ల మంద కాస్తున్న ఎర్రయ్య మీదపడి "ఎదవా! మా ఎమ్మెల్లే మీద అడ్డదిడ్డంగా వాగుతావురా?" అని అడిగి నాలుగు పోట్లు పొడిచి పోయారు.

ఆ రాత్రితో నెలరోజుల క్రితం మొదలైన 'ఓట్ల సంబరం' ముగిసింది.*

(1985)